

ఆదిలాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

# పార్టీ కార్యకర్తలే బలం

● మంత్రి హరీశ్‌రావు సభ సక్సెస్ ● ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

ఎదులాపురం, అక్టోబర్ 29 : బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలే నా బలం. నా బలగం.. అని వారి కృషి ఎన్నడు మరువలేనిదని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ సందర్భంగా నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ కనీవినీ ఎరుగని రీతిలో సాగిందని అన్నారు. ఎన్నికల ప్రచారంలో విశేష కృషి చేస్తున్న కార్యకర్తలను ఎన్నటికీ మరువబోమన్నారు. ఎన్ని జన్మలెత్తినా, ఎన్ని ఉన్నత పదవులు దక్కినా కార్యకర్తల కృషి మరువలేనిదని పేర్కొన్నారు. వారిని గుండెల్లో పెట్టి చూసుకుంటానని భావోద్వేగంతో మాట్లాడారు. మంత్రి హరీశ్‌రావు పాల్గొన్న సభలో మైదానం పూర్తిగా నిండి బయట నిలబడి ప్రసంగాన్ని విన్నారన్నారు. ఇటీవల జరిగిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సభకు ఉమ్మడి జిల్లా నుండే కాకుండా నిజామాబాద్, మహారాష్ట్ర నుంచి జనాలను తరలించారని గుర్తు చేశారు. ఎన్నికల్లో తమకు ప్రత్యర్థులు లేరని హరీశ్‌రావు పాల్గొన్న సభ చాటి చెప్పిందన్నారు. సోమవారం జైనథ్ లోని శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం మండలంలో ప్రచారాన్ని విస్తృతంగా చేపడతామన్నారు. కార్యకర్తలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు. రైతుబంధు సమితి అధ్యక్షుడు రోకండ్ల రమేశ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, ఫ్లోర్ లీడర్ బండారి సతీశ్ పాల్గొన్నారు.



గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

# బీఆర్ఎస్‌లో పండ్ల వ్యాపారుల చేరిక

వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే రామన్న

ఎదులాపురం, అక్టోబర్ 29 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో ఆదివారం ఏర్పాటు చేసిన పార్టీ చేరికల కార్యక్రమానికి ఎమ్మెల్యే రామన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని నేతృత్వంలో ఫ్రూట్, హాకర్స్ యూనియన్ నాయకులు దాదాపు 300 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి రామన్న గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదల కష్టసుఖాల్లో అండగా నిలుస్తూ.. వారి అభివృద్ధికి పాటు పడుతున్నామని, అధికారం కోసం గొడవలు సృష్టించే పార్టీలకు కాకుండా సమాజ అభ్యున్నతికి కృషి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టాలని అన్నారు. పండ్ల వ్యాపారులకు అన్ని విధాల అండగా ఉంటామని, రుణాల మంజూరుకు తగు చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి అలాల్ అజయ్, అష్రఫ్, ఫ్రూట్ యూనియన్ అధ్యక్షుడు అజీంఖాన్, నయీం, అన్వర్ చౌదరి, మొహిద్‌ఖాన్, అలీం పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో టికెట్ల రచ్చ

ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో నిరసనలు




కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన ఆదిలాబాద్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ కలీం

● జిల్లా మైనార్టీ అధ్యక్షుడు, ఇతర నాయకుల రాజీనామా ● నేడు ఆదిలాబాద్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం ● బోథ్ నియోజకవర్గంలో ఆందోళనల పర్వం

ఆదిలాబాద్, అక్టోబర్ 29(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ టికెట్ల పంచాయితీ తీవ్రరూపం దాల్చింది. రెండో విడుత జాబితాలో ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి కంది శ్రీనివాస్‌రెడ్డి, బోథ్ నుంచి వన్నెల అశోక్‌కు పార్టీ అభ్యర్థులుగా ప్రకటించింది. వీరి అభ్యర్థిత్వాన్ని నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అధిష్టానం పార్టీ జెండాను మోసిన వారికి కాకుండా ఇతరులకు టికెట్లు ఇచ్చిందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గ టికెట్ కంది శ్రీనివాస్‌రెడ్డికి ఇవ్వద్దంటూ నాయకులు, కార్యకర్తలు మొదటి నుంచి పార్టీ నాయకులను



మైనార్టీ నాయకుని రాజీనామా పత్రం

కోరుతున్నారు. ఎన్ఆర్ఐగా ఉన్న శ్రీనివాస్‌రెడ్డి బీజేపీలో చేరారని, తాను ఆర్ఎస్ఎస్ కార్యకర్తనని ప్రచారం చేసుకున్నారని, అక్కడి టికెట్ నిరాకరించినందుకు కాంగ్రెస్‌లో చేరారని హస్తం పార్టీ నాయకులు అధిష్టానానికి సూచించారు. కాంగ్రెస్‌లో ఏండ్లుగా పనిచేస్తున్న డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సుజాత, సీనియర్ నాయకులు సంజీవరెడ్డికి టికెట్లు ఇవ్వాలని కోరారు, శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ ఇవ్వద్దంటూ హైదరాబాద్‌లోని గాంధీ భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు.

బోథ్ నియోజకవర్గంలో టికెట్ విషయంలో ఆ పార్టీ సీనియర్లు నరేశ్‌జాదవ్, ఆడే గజేందర్‌లు ఆశలు పెట్టుకున్నారు. ఎన్నో ఏళ్లుగా పార్టీకి సేవ చేసిన వారిని కాదని వేరే వ్యక్తికి టికెట్ ఎలా ఇస్తారంటూ నాయకులు, కార్యకర్తలు మండిపడుతున్నారు.

## మైనార్టీ నాయకుల రాజీనామా

ఆదిలాబాద్ టికెట్ విషయంలో అధిష్టానం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ మైనార్టీ విభాగం నాయకులు రాజీనామా చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు పార్టీ టికెట్‌ను ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు కలిగిన వ్యక్తికి అమ్ముకున్నారని నాయకులు షేక్ కలీం ఆరోపిస్తున్నారు. మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ కలీం, ప్రధాన కార్యాదర్శి అన్వర్‌బాయ్, ఆదిలాబాద్ పట్టణ అధ్యక్షుడు రసూల్‌ఖాన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇమ్రాన్‌ఖాన్‌తోపాటు వివిధ విభాగాల నాయకులు, మండల కమిటీల అధ్యక్షులు రాజీనామా చేశారు.

## నేడు ఆదిలాబాద్‌లో సమావేశం

ఆదిలాబాద్‌లో సోమవారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు సమావేశం ఏర్పాటు చేసుకోనున్నారు. ఇందులో టికెట్ అభ్యర్థి విషయంలో అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని చర్చించనున్నారు. డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సుజాత, సీనియర్ నాయకుడు సంజీవ్‌రెడ్డి, వివిధ విభాగాల అధ్యక్షులు పాల్గొననున్నారు. బోథ్‌లో టికెట్ విషయంలో అధిష్టానం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించనున్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో కార్యకర్తల మనోగతాన్ని విస్మరించినందునా పార్టీ సీనియర్లలో ఒకరు పోటీలో ఉంటారని నాయకులు తెలిపారు.

# నిర్మల్ జిల్లా బీఆర్ఎస్ అధికార ప్రతినిధిగా అమరవేణి నర్సాగౌడ్



నియామక పత్రాన్ని అందిస్తున్న మంత్రి అల్లోల

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 29 : నిర్మల్ జిల్లా బీఆర్ఎస్ అధికార ప్రతినిధిగా అమరవేణి నర్సాగౌడ్‌ను రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇప్పటికే ముడుసు సత్యనారాయణ జిల్లా అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారన్నారు. సత్యనారాయణతోపాటు అమరవేణి నర్సాగౌడ్ ఈ పదవిలో ఉంటారన్నారు. నిర్మల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు వీరిద్దరి సేవలను ఉపయోగించుకోవాలని నిర్ణయించామన్నారు.

## కర్ణాటకలో ఐదు గంటలే కరెంటు

కర్ణాటకలో ఐదు గంటలే కరెంటు ఇస్తున్నామని సాక్షాత్తు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రకటించారని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే తెలంగాణ రాష్ట్రంలో అదే పరిస్థితి ఉత్పన్నమవుతుందని అన్నారు. ఆదివారం బేస్తవార్‌పేటలో వంజర సంఘం బ్రహ్మపురిలో కత్రి సంఘాలు నిర్వహించిన సమావేశాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కర్ణాటకలో రైతులు, పారిశ్రామికవేత్తలు కరెంటు కోసం రోడ్ల మీదకు వచ్చి నిరసనలు వ్యక్తం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపిస్తే అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో అన్ని సంఘ భవనాలు నిర్మించుకుంటామన్నారు.

# బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం

ఔర్ ఏక్ దక్కా..
బీఆర్ఎస్ హ్యాట్రిక్ పక్కా

● ఇతర పార్టీల నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దు ● విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్

● ఆయా చోట్ల విస్తృతంగా ప్రచారం ● 50 మంది రెల్లి సంఘం సభ్యుల చేరిక



ప్రచారంలో బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్న ప్రజలు



షిరిడీ సాయిబాబా దేవాలయంలో పూజలు చేస్తున్న విప్ బాల్క సుమన్

రామకృష్ణాపూర్, అక్టోబర్ 29 : చెన్నూరు నియోజకవర్గ గడ్డమీద మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిధ బాల్క సుమన్ పేర్కొన్నారు. ఆదివారం క్యాతనపల్లి మున్సిపాలిటీలోగల సూపర్ బజార్ సెంటర్‌లోని సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఔర్ ఏక్ దక్కా.. బీఆర్ఎస్ హ్యాట్రిక్ పక్కా అని, ఇతర పార్టీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. అభివృద్ధి యజ్ఞం ఇలాగే కొనసాగాలంటే బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీని మరోసారి గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

## పలకరిస్తూ... ఆశీర్వాదం తీసుకుంటూ..

సూపర్ బజార్ సెంటర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలవేసి.. 15వ వార్డు మల్లికార్జుననగర్, 14వ వార్డు పోచమ్మ బస్తీ, 12వ వార్డు గాంధీ నగర్, కాకతీయ కాలనీ, 11వ వార్డు శివాజీనగర్‌లో గడప గడపకూ తిరిగి బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరించారు. ప్రజలు, వ్యాపారులను పలకరిస్తూ.. ఆశీర్వాదం తీసుకుంటూ ముందుకు సాగారు. పోచమ్మ బస్తీలోని పోచమ్మ గుడిలో పూజలు చేశారు. మహిళలు బొట్టు పెట్టి, కండువాలు కప్పి ఆశీర్వదిస్తూ కారు గుర్తు ఓటు వేస్తామని చెపారు. కనకదుర్గా కాలనీ సమీపంలో ఆదివారం సంతలో ప్రచారం నిర్వహించారు. 13వ వార్డు కౌన్సిలర్ జాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెల్లి సంఘం సభ్యులు 50 మంది బాల్క సుమన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జంగం కళ, పట్టణ పార్టీ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, కౌన్సిలర్లు గడ్డం విజయలక్ష్మి రాజు, బొద్దుల రమ్యప్రేమ్‌సాగర్ గడ్డం సంపత్‌కుమార్, జాడి శ్రీనివాస్, పుల్లూరి సుధాకర్, పోగుల మల్లయ్య, పొలం సత్యం, అలుగుల శ్రీలతసత్తయ్య, నాయకులు రామిడి కుమార్, గంగారపు సత్యపాల్, కొక్కుల సత్తీష్, గాజుల చంద్రకిరణ్ పాల్గొన్నారు.



చేపల దుకాణంలో చేపలు అమ్ముతూ..

# సంక్షేమ పథకాలే మా బలం

● పేదల కోసం అనేక పథకాలు అమలు ● 3న ప్రజా ఆశీర్వాద సభను సక్సెస్ చేయండి ● ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా, అక్టోబర్ 29 : సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే తమ బలమని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం భైంసా పట్టణంలోని సంజీవ్‌రెడ్డి ఫ్యాక్టరీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. తెలంగాణలో రైతు బీమా, రైతుబంధు, రుణమాఫీ, సాగు, తాగు నీరు, ఉచిత విద్యుత్, కల్యాణలక్ష్మి, గృహలక్ష్మి వంటి పథకాలు పేదల కోసం సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే మొదటి స్థానంలో ఉందని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను దీవించాలని కోరారు.



మాట్లాడుతున్న ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

## ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయండి

ఈ నెల 3న శుక్రవారం ప్రజా ఆశీర్వాద భారీ బహిరంగ సభను నిర్వహించనున్నామని, దీనిని విజయవంతం చేయాలని కోరారు. ఈ సభకు సీఎం కేసీఆర్ రానున్నారని మధ్యాహ్నం 1 గంటలకు నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు ముథోల్ నియోజకవర్గంలోని నలుమూలల నుంచి బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మురళిగౌడ్, సంజీవ్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు ఫారూఖ్ హైమద్, ప్రధాన కార్యదర్శి తోట రాము, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ, ఆశా, ఖాలీద్, భోజరాం, సూరి, దేవిదాస్, రాజు, యశ్వంత్ బన్సోడే ఉన్నారు.

# బతుకుల్లో వెలుగులు నింపేలా బీఆర్ఎస్ మ్యానిఫెస్టో

● ఎన్నికల టూరిస్టులను నమ్మి మోసపోవద్దు ● ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 29 : బీఆర్ఎస్ మ్యానిఫెస్టో పేదల బతుకుల్లో వెలుగులు నింపేలా ఉన్నదని మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. ఇంటిం టా బీఆర్ఎస్ ప్రచారంలో భాగంగా ఆదివారం ఉదయం మంచిర్యాల పట్టణంలోని మూడో వార్డు తిలక్‌నగర్, సూర్యనగర్‌లలో ఆయన ప్రచారం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరుగుతూ వివరించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో అమలు కావాలంటే నవంబర్ 30న జరిగే పోలింగ్‌లో కారుగుర్తుకే ఓటువేసి గెలిపించాలని కోరారు. ఎన్నికల సమయంలో వచ్చిపోయే టూరిస్టుల మాటలు నమ్మిమోసపోవద్దని, నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ మీ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న వారికే ఓటువేయాలని కోరారు. ప్రశాంతంగా ఉన్న మంచిర్యాలలో రౌడీయిజానికి చోటు లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీపతివాసు, కర్రు శంకర్, గరిగంటి సరోజ పాల్గొన్నారు.



మంచిర్యాలలోని సూర్యనగర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

# బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి అల్లోల



సారంగాపూర్ : నాయకులను బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ అర్బన్/ లక్ష్మణచాంద/నర్సాపూర్(జి)/ సారంగాపూర్, అక్టోబర్ 29 : నిర్మల్ జిల్లాకేంద్రంతోపాటు లక్ష్మణచాంద, నర్సాపూర్(జి), సారంగాపూర్ మండలాలకు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నిర్మల్ పట్టణంలోని కైకాడి, గంగపుత్ర సంఘం.. మైనార్టీ, అంబేద్కర్ యువజన సంఘం.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు.. లక్ష్మణచాంద మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన 100 మందికి పైగా యాదవ సంఘ సభ్యులు.. నర్సాపూర్(జి) మండల కేంద్రానికి చెందిన 50 మంది ముస్లింలు, టెంబుర్ని గ్రామానికి చెందిన 40 మంది.. సారంగాపూర్ మండలంలోని బీరవెల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ, బీఎస్పీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు పర్చని సంక్షేమ పథకాలు, అభివృద్ధిని బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి మనుగడ లేదని, రాష్ట్రంలో టీడీపీ ఎలా కనుమరుగయిందో అదేగతి కాంగ్రెస్‌కు పడుతుందన్నారు. అంబానీ, అదానీ ఆస్తుల కోసమే బీజేపీ పని చేస్తోందని, దేశంలో ధరల నియంత్రణ, పేద ప్రజల సంక్షేమానికి కృషి చేయడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. దేశంలో మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు బీజేపీ యత్నిస్తోందని మండిపడ్డారు. వివిధ చోట్ల జరిగిన కార్యక్రమాల్లో నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్ఎస్ పార్టీ లక్ష్మణచాంద మండల ఇన్‌చార్జి, మంత్రి సోదరుడు అల్లోల సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కొరిపెల్లి కృష్ణారెడ్డి, నర్సాపూర్ జడ్పీటీసీ చిన్న రామయ్య, జిల్లా రైతుబంధు సమితి కో-ఆర్డినేటర్ నల్లావెంకట్‌రాంరెడ్డి, ఎంపీపీ అట్ల మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల ఇన్‌చార్జి అల్లోల మురళీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కొత్తపెల్లి మాధవరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఇప్ప రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



నిర్మల్ అర్బన్ : బీఆర్ఎస్‌లో చేరిన వారితో మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి



లక్ష్మణచాంద : బీఆర్ఎస్‌లో చేరిన యాదవ సంఘ సభ్యులతో..